వాడపల్లి క్షేత్రం.. ప్రగతి ధామం

న్యూస్‌టుడే, అత్రేయపురం

కోనసీమ తిరుమల వాడపల్లి వెంకన్న క్షేత్రంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. భక్తులకు మరిన్ని వసతులు అందుబాటులోకి రానున్నాయి. దేవస్థానం, ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి చేపడుతున్న పనులు చివరి దశలో ఉన్నాయి. త్వరలో వినియోగంలోకి తీసుకొస్తామని దేవస్థానం డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర రావు తెలిపారు.

వకుళమాత అన్నదాన సదనం

రూ.6.25 కోట్లతో నూతన భవనం

ప్రస్తుతం పాత భవనం, పార్కింగ్ ప్రదేశంలో అన్నదానం నిర్వహిస్తున్నారు. ఒకేసారి 3వేల మంది పైగా భక్తులు అన్నప్రసాదం తినేలా అన్ని హంగులతో వకుళమాత అన్నదాన సదనం నిర్మిస్తున్నారు. ఏప్రిల్ నెలాఖరుకు పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు.

రూ.12 కోట్లతో వసతి గదులు..

భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా వసతి గదులు, డార్మిటరీ నిర్మించేందుకు దేవస్థానం చర్యలు చేట్టింది. ఇందులతో షెడ్ నిర్మాణం జరుగుతోంది.

ఆహ్లాదంగా కోనేరు..

స్వామివారి రాజగోపురం తూర్పు వైపున గౌతమీ గోదావరి గట్టు ఆనుకుని రూ.2.80కోట్లతో చేపట్టిన కోనేరు నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఆహ్లాదకరంగా ఉండేలా పరిసరాలను తీర్చిదిద్దాలని దేవస్థానం యోచిస్తోంది.

చివరి దశలో రథశాల..

వాడపల్లి కల్యాణ ఉత్సవాల్లో రథోత్సవానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తుంటారు. రథం భద్రపరిచేందుకు రూ.35 లక్షల కోసం స్థలం ఎంపిక చేశారు. రూ.12 కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

● గోవిందనగర్ కొత్త వంతెన నుంచి పార్కింగ్ వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. ఇవి పూర్తయితే ట్రాఫిక్ సమస్య చాలా వరకు పరిష్కారం అవుతుంది. భక్తులు సులువుగా ప్రదక్షిణలు చేసుకునేందుకు మాడ వీధులు విస్తరించేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఈవో తెలిపారు.

భీమేశ్వరా.. భక్త శుభకరా..

పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోటలోని కుమారారామ భీమేశ్వరాలయం సోమవారం ప్రత్యేక పూజలతో ఆధ్యాత్మిక వైభవాన్ని సంతరించుకుంది. తెల్లవారుజాము నుంచే స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనను ఆలయ పండితులు నిర్వహించారు. మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారిని దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. వారికి ఆలయ కమిటీ సౌకర్యాలు కల్పించింది.

– న్యూస్‌టుడే, సామర్లకోట గ్రామీణం

తనిఖీలతో సరి.. కార్యాచరణ ఏదీ!

● పాలకేంద్రాలపై పకడ్బందీ పర్యవేక్షణతోనే కల్తీలకు అడ్డుకట్ట

ఈనాడు, రాజమహేంద్రవరం: పాలల్లో ఇథిలీన్ గ్లైకాల్ వంటి ప్రమాదకర రసాయనాలు కలవడం వల్ల రాజమహేంద్రవరానికి చెందిన 12 మంది ప్రాణాలు కోల్పోవడం అందరినీ కలచివేసింది. మరో 8 మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గత నెల 15న కల్తీ పాల సరఫరా జరగ్గా ఆ తర్వాత వివిధ కేంద్రాల్లో తనిఖీలు చేసిన యంత్రాంగం అనంతరం పటిష్ట చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. జిల్లా కేంద్రంలో ఇప్పటికే వాయు కాలుష్య తీవ్రత అధికంగా ఉంది. మరో వైపు పాలు, ఆహార కల్తీ యథేచ్ఛగా సాగుతోంది. కొన్ని రెస్టారెంట్లు, హోటళ్లలో తనిఖీలు చేసినప్పుడల్లా నిల్వ చేసిన, కుళ్లిన మాంసాలు, నిషేధిత రంగుల వినియోగం కనిపిస్తున్నా కట్టడికి పకడ్బందీ వ్యవస్థ లేదు.

గణేష్ నిర్వహిస్తున్న అనధికార పాల సేకరణ కేంద్రంలో యంత్రాలు

ఇష్టారీతిన కలిపి..

కొందరు చిరు వ్యాపారులు తాము సేకరించిన పాలల్లో నీళ్లు కలిపి విక్రయిస్తున్నారు. ఇంకొందరు అత్యాశకు పోయి యూరియా, డిటర్జెంట్ తదితర మిశ్రమాలు కలుపుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. ఇటువంటివి దీర్ఘకాలంలో ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. కల్తీ ఘటనకు కారణమైన కోరుకొండ మండలం నరసాపురానికి చెందిన వ్యాపారి గణేశ్వరరావు తాను రోజూ దాదాపు 80 లీటర్ల పాలు సేకరించి, 30 లీటర్ల మేర నీరు కలిపి విక్రయిస్తున్నానని ఇటీవల విచారణలో పేర్కొన్నట్లు తెలుస్తోంది.

సిబ్బంది కొరత చూపి..

● నరసాపురంలో పదకొండేళ్లుగా గణేష్ పాల కేంద్రాన్ని నిర్వహిస్తున్నా ఎవరికీ పట్టలేదు. అనేకమంది ప్రాణాలు కోల్పోతే తప్ప ఆ కేంద్రం అనధికారికంగా నడుస్తుందని గుర్తించలేదు. ● పాల కేంద్రాల్లో ఎన్నింటికి అనుమతి ఉంది? ఎన్నింటికి లేవన్న అంశంపై స్పష్టత లేదు. ● తనిఖీలు చేసేందుకు వీలుగా జిల్లాలో ప్రత్యేక కేంద్రాలు అవసరం. ● సిబ్బంది కొరత సాకు చూపి ఆహార భద్రత అధికారులు సోదాలు చేయడంలేదన్న విమర్శలున్నాయి. కల్తీపై ప్రజలకు అవగాహన కల్పించడం, ఇళ్ల వద్దే గుర్తించేలా సూచనలు చేయొచ్చు.

జిల్లాలో ఇదీ పరిస్థితి

1.30 లక్షలు.. పశువుల సంఖ్య

7.80 లక్షల లీటర్లు.. రోజుకు సగటున పాల ఉత్పత్తి

3.15లక్షల లీటర్లు.. పశువులు ఇంటింటా సరఫరా చేస్తున్న పాలు

ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తాం...

-కీర్తి చేకూరి, కలెక్టర్,

ఆహార నాణ్యత తనిఖీలు నిరంతరం కొనసాగించేలా ప్రత్యేక బృందాలు నియమిస్తాం. తొలుత రాజమహేంద్రవరం పరిధిలో ప్రారంభించి క్రమంగా విస్తరిస్తాం. పాలల్లో కల్తీని గుర్తించేందుకు ఆకస్మిక తనిఖీలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నాం.

గోడ పత్రాలు ఆవిష్కరిస్తున్న జేసీ మేఘాస్వరూప్ తదితరులు

గర్భాశయ క్యాన్సర్ నివారణకు టీకా

కలెక్టరేట్ (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: గర్భాశయ క్యాన్సర్ నివారణకు ముందస్తుగా 14 ఏళ్ల వయసు బాలికలకు హ్యూమన్ పాపిలోమా వైరస్(హెచ్‌పీవీ) ఒక డోసు టీకా(వ్యాక్సిన్) వేయనున్నారు. వ్యాక్సినేషన్ విధానంపై ఇప్పటికే వైద్యాధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో మంగళవారం నుంచి హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు జేసీ వై. మేఘాస్వరూప్ తెలిపారు. దీనికి సంబంధించిన ప్రచార గోడపత్రాలను సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు.

జిల్లాలో బాలికలు (14ఏళ్లు) : 13,964
మొదటి విడత డోసులు : 7,681
ప్రారంభం : మంగళవారం నుంచి

తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి

● పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలలో, కోల్డ్ చైన్ పాయింట్ల వద్ద మాత్రమే వ్యాక్సినేషన్ ఉంటుంది. ● బాలికల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వారి సమ్మతి తీసుకున్న తర్వాతే వ్యాక్సిన్ వేస్తారు. ● టీకా అనంతరం ధ్రువపత్రం కూడా ఇస్తారు. ● ఈ ప్రక్రియ ప్రతి రోజూ కొనసాగుతుంది.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

శ్యామలా సెంటర్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సోమవారం గణితం 2బి, ఒకేషనల్ వారికి గణితం 2, బయాలజీ సైన్స్ 2 పరీక్షలు జరిగాయి. జనరల్ విభాగంలో 13489కు 13372, ఒకేషనల్ విభాగంలో 993కు 928 మంది చొప్పున విద్యార్థులు హాజరయ్యారని ఆర్ఐవో శారద తెలిపారు. ●జనరల్ బ్రిడ్జి కోర్సు పరీక్ష ఈ నెల 18న ధవళేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తారన్నారు. దీనికి సంబంధించిన హాల్‌టికెట్లు ఆయా కళాశాలల లాగిన్ నుంచి పొందవచ్చన్నారు.

జాడ చిక్కని పెద్దపులి

ఏలేశ్వరం, రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: కాకినాడ, పోలవరం జిల్లాల సరిహద్దుల్లో రోజుకో ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తూ జనానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఆదివారం రాత్రి కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం మర్రివీడు పంచాయతీ శివారు పరిమితడక గ్రామంలోని ఆయిల్‌పామ్ తోటలో గేదె దూడపై దాడిచేసి గాయపరిచింది. జిల్లా అటవీ శాఖాధికారి ఎన్.రామచంద్రరావు పరిమితడక చేరుకుని కొన ఊపిరితో ఉన్న దూడకు వైద్యం చేయించడంతో కోలుకొంది. తహసీల్దార్ కుశరాజు, ఆర్ఐ ఎస్.పొన్నాలు గ్రామానికి చేరుకుని రైతు సంకాబత్తుల వీర్రాజు నుంచి వివరాలు సేకరించారు.

పాపికొండల అభయారణ్యంలో డ్రోన్ కెమెరాకు చిక్కిన పులి

బోర్నగూడెం పరిసరాల్లో మాటు..

పరిమితడక నుంచి రాజవొమ్మంగి మండలం వైపు సోమవారం పయనించి బోర్నగూడెం పరిసరాల్లో పులి మాటు వేసినట్లు శాటిలైట్ చిత్రాల ద్వారా అటవీ శాఖాధికారులు గుర్తించారు. పులిని పట్టుకునేందుకు నాగార్జునసాగర్ నుంచి శిక్షణ పొందిన అటవీ సిబ్బందిని రప్పించారు. అవకాశం ఉన్నంత మేర డ్రోన్ కెమెరాతో గాలిస్తున్నారు. పులి మెడలో ఉన్న శాటిలైట్ కాలర్ నుంచి సిగ్నళ్లు రాకపోవడంతో అడ్డతీగల సబ్ డీఎఫ్‌వో సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వీహెచ్‌ఎఫ్ (వెరీ హైఫ్రీక్వెన్సీ) సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి జాడ కనిపెట్టేందుకు ప్రయత్నించారు. రేంజ్ ఉషారాణి, ఎఫ్ఎస్‌వో బాలాజీ, ఎఫ్‌బీవో రామకృష్ణ, సిబ్బంది బోర్నగూడెం, ఉర్లాకులపాడు, సంజీవనగర్, చెరుకుంపాలెం, మర్రిపాలెం, కొట్టంపాలెం, గవరయ్యపేట, కోనలోప గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేశారు.

● నగరంలోని సీతంపేటకు ఇద్దరు మైనర్లు గతేడాది డిసెంబరులో మోరంపూడి వద్ద జాతీయ రహదారిపై వెళ్తూ మరో ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి పడిపోయారు. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి.

● నగరానికి చెందిన ఓ బాలుడు ఇటీవల స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంపై వేగంగా వెళ్లడంతో మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాడు. వారితోపాటు బండి యజమానిపై సైతం కేసు నమోదైంది.

కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ పోలీసు

ఒత్తిడి చేస్తే కరిగిపోవద్దు..

కేసుల్లో ఇరుక్కోవద్దు..!

న్యూస్‌టుడే, కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలో వాహన ప్రమాదాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. వీటికి అనేక కారణాలున్నా మైనర్ల డ్రైవింగ్ అందరినీ కలవరపెడుతోంది. పిల్లలు గొడవ పెడుతున్నారని ఇంట్లో తల్లిదండ్రులు ద్విచక్రవాహనాలు కొనిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా బాధ్యతారాహిత్యంతో వారు బండి నడిపి ప్రమాదాలకు కారణమవుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో రీల్స్ చేసి లైకుల కోసం విచిత్రమైన విన్యాసాలు చేస్తూ వీడియోలు రికార్డు చేస్తున్నారు. ఈ క్రమంలో కొన్నిసార్లు తమతోపాటు ఇతరులనూ ప్రమాదాలపాలు చేస్తున్నారు.

కఠిన చట్టాలున్నా..

జిల్లాలోని కళాశాలలు, పాఠశాలలకు ఎక్కువ మంది ద్విచక్రవాహనాలపై వస్తున్నారు. 18 ఏళ్లు నిండకుండా బండి నడపడం చట్టరీత్యా నేరం. ప్రభుత్వాలు ఎన్ని కఠిన చట్టాలు తెచ్చినా తల్లిదండ్రులు బాధ్యతగా ఉండట్లేదనే విమర్శలు ఉన్నాయి. మైనర్లు డ్రైవింగ్ చేస్తూ ఎక్కువగా పోలీసులకు ఎక్కువగా చిక్కుతున్నారు.

మైనర్ల డ్రైవింగ్ కేసులు ఇలా..

సంవత్సరం	కేసులు	జరిమానాలు (రూ.లక్షల్లో)
2024	908	4.54
2025	388	2.30
2026	03	15

తల్లిదండ్రులదే నేరం..

● మైనర్లు వాహనం నడిపితే తనిఖీల్లో పోలీసులు వాహనాన్ని సీజ్ చేస్తారు. ● పోలీసులకు చిక్కితే రూ.10 వేల వరకు జరిమానా విధిస్తారు. ● ప్రమాదానికి కారణమైతే తల్లిదండ్రులు లేదా సంరక్షకుడికి జైలుశిక్ష విధించడంతోపాటు వారి డ్రైవింగ్ లైసెన్సు రద్దు చేస్తారు. ● 16-18 ఏళ్లలోపు దాటిన వారు గేర్లు లేని ద్విచక్రవాహనం నడపొచ్చు. 18 ఏళ్లు నిండిన తరువాతే బైకు, కారు లైసెన్సు తీసుకోవాలి.

ప్రత్యేక డ్రైవ్ చేపడతాం

మైనర్లకు ద్విచక్రవాహనం ఎవరూ ఇవ్వకూడదు. త్వరలో ప్రత్యేక డ్రైవ్ చేపడతాం. బండి ఇచ్చిన వారిపైనా కేసులు నమోదు చేస్తాం. పిల్లలు ఎంత ఒత్తిడి చేసినా వాహనాలు ఇవ్వకుండా ప్రత్యామ్నాయంగా ఏదో ఒకటి చేయాలి. ప్రమాదాల తీవ్రత, కేసుల్లో ఇరుక్కుంటే కలిగే ఇబ్బందులను వారికి వివరించాలి. - డీ.నరసింహకిషోర్, ఎస్పీ

రైతేరాజు

అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -8లో

ఉసురుతీసిన వేధింపులు

కోటనందూరు, న్యూస్‌టుడే: ఆమె ఉన్నత విద్య అభ్యసించారు. భవిష్యత్తుపై ఎన్నో కలలు కన్నారు. భర్త సైతం ఇటీవల ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా కొలువు సాధించాడు. .కానీ అటు భర్తతో పాటు అత్తింటివారి వేధింపులు తీవ్రమవడంతో కుమారుడితో సహా చెరువులో దూకి ఆమె ఆత్మహత్యకు పాల్పడ్డారు. మహిళా దినోత్సవం రోజున కాకినాడ జిల్లా కోటనందూరు మండలం కాకరాపల్లి శివారు తమ్మయ్య చెరువులో ఈ ఘటనకు పాల్పడగా సోమవారం వెలుగు చూసింది. బంధువులు, కోటనందూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

రాజమహేంద్రవరం గ్రామీణం ధవళేశ్వరానికి చెందిన నెల్లి భాగ్యలక్ష్మి(34) ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ పూర్తిచేశారు. నాలుగేళ్ల క్రితం అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సమీప పెద బొడ్డేపల్లికి చెందిన వడిశల దుర్గాప్రసాద్‌తో వివాహమైంది. ఆయనకు ఇది రెండో వివాహం. వీరికి కుమారుడు సాయి ఇషాన్ (3) ఉన్నాడు. ఇటీవల డీఎస్సీలో దుర్గాప్రసాద్ వ్యాయామ ఉపాధ్యాయుడిగా కొలువు సాధించి రోలుగుంట మండలంలో పనిచేస్తున్నాడు. కొంత కాలంగా భర్త, అత్తింటివారు భాగ్యలక్ష్మిని వేధింపులకు గురిచేస్తున్నారని తల్లి రత్నం, సోదరుడు ఉదయ్‌సాగర్ ఆరోపిస్తున్నారు. ఇటీవల భాగ్యలక్ష్మి ధవళేశ్వరం నానమ్మ మృతిచెందడంతో 8 నుంచి వారు కనిపించకపోవడంతో ధవళేశ్వరం పోలీసులకు ఫిర్యాదుచేశారు. సోమవారం నర్సీపట్నంలో ఫిర్యాదు చేయడానికి బయల్దేరారు. ఈ క్రమంలోనే తమ్మయ్య చెరువులో ఇరువురి మృతదేహాల సమాచారం అందడంతో పరిశీలించి వారివేనని గుర్తించారు. భర్త దుర్గాప్రసాద్, మామ, ఇతర కుటుంబ సభ్యుల వేధింపుల వల్లే భాగ్యలక్ష్మి బిడ్డతో సహా ఆత్మహత్యకు పాల్పడిందని ఉదయ్‌సాగర్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

భాగ్యలక్ష్మి, సాయి ఇషాన్

గ్రేడ్లుగా పంచాయతీల విభజన

● రూర్బన్ కేటగిరీలోకి 31 గ్రామాలు

ఈనాడు, రాజమహేంద్రవరం: పంచాయతీల్లో పారదర్శక పాలనతోపాటు.. అందుబాటులో అన్ని సేవలు ఉండేలా ప్రభుత్వం సంస్కరణలు తీసుకొచ్చింది. జనాభా, ఆదాయం, భౌగోళిక పరిస్థితుల ఆధారంగా రూర్బన్, గ్రేడ్-1, 2, 3గా విభజిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. తూర్పుగోదావరి జిల్లాలోని 21 మండలాల పరిధిలో 343 పంచాయతీలను నాలుగు విభాగాలుగా చేశారు. రూర్బన్‌గా 31, గ్రేడ్ -1గా 167, గ్రేడ్-2 గా 75, గ్రేడ్-3గా 69 పంచాయతీలను విభజించారు.

● 10 వేల జనాభా, రూ.కోటి ఆదాయమున్న పంచాయతీలను రూర్బన్‌గా.. 3000-10,000 జనాభా, రూ.30 లక్షల నుంచి రూ.కోటి ఆదాయం మధ్య ఉంటే గ్రేడ్ -1 పంచాయతీగా గుర్తించారు. మండల కేంద్రాల్లోని పంచాయతీలనూ ఈ పరిధిలోకి తీసుకొచ్చారు. 2 వేల నుంచి 3 వేల మధ్య జనాభా ఉంటే గ్రేడ్ -2గా, అంతకంటే తక్కువ జనాభా ఉన్నవాటిని గ్రేడ్ 3గా గుర్తించారు.

■ రూర్బన్ ✦ గ్రేడ్1 ✤ గ్రేడ్ 2 ✪ గ్రేడ్ 3

మండలం	■	✦	✤	✪
అనపర్తి	1	6	4	0
బిక్కవోలు	2	6	3	2
చాగల్లు	1	5	3	2
దేవరపల్లి	1	8	3	3
గోకవరం	1	8	3	3
గోపాలపురం	1	7	5	5
మండపేట	3	5	3	1
నల్లజర్ల	2	8	5	9
పెరవలి	1	10	3	4
ఉండ్రాజవరం	3	8	2	2
రాజానగరం	3	14	6	4
రాయవరం	1	7	1	3

(కడియంలో రూర్బన్ కింద మూడు, గ్రేడ్-1 కింద 7, గ్రేడ్2లో ఒకదానిని ఎంపికచేశారు. కపిలేశ్వరపురం, కోరుకొండ, కొవ్వూరు, రంగంపేట, సీతానగరం, తాళ్లపూడి, నిడదవోలులో రూర్బన్‌గా గుర్తించినవి లేవు.)

అర్జీలు పూరిస్తున్న సిబ్బంది

కలెక్టరేట్‌కు 205 వినతులు

కలెక్టరేట్(రాజమహేంద్రవరం): కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన జిల్లాస్థాయి ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్), భూసంబంధ ఫిర్యాదుల పరిష్కారవేదిక(రెవెన్యూక్లినిక్)కు 205 అర్జీలు వచ్చాయి. రెవెన్యూక్లినిక్‌కు 87 , వివిధ శాఖల పరిధిలోని 118 చొప్పున వినతులు వచ్చాయి. జేసీ మేఘాస్వరూప్, ఆర్డీవోలు, డీఆర్వో సీతారామమూర్తి అర్జీలు స్వీకరించారు. అర్జీలను సత్వరం పరిష్కరించాలని సంబంధిత అధికారులను జేసీ ఆదేశించారు.

వందేళ్ల వృక్షానికి పునరుజ్జీవం

జమ్మి, రావి చెట్లు కలిసిన మహా వృక్షాన్ని కోలమూరులోని వేదపాఠశాల ఆవరణలో నాటి ప్రాణం పోశామని రోటరీ క్లబ్ ఐకాన్స్ సభ్యుడు, దుర్గాప్రసాద్ తెలిపారు. గతేడారి కాతేరు రోడ్డులోని వృక్షాన్ని రహదారి వెడల్పు ప్రక్రియలో భాగంగా శాస్త్రీయంగా తొలగించి, సంరక్షించామన్నారు. వేద పాఠశాల ఆవరణంలో సోమవారం నాటామన్నారు.

– న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

వేదపాఠశాల ఆవరణలో వృక్షాన్ని నాటుతున్న క్రేన్

మహిళలు మార్గనిర్దేశకులు

● మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, న్యూస్‌టుడే: మహిళలు సమాజాన్ని నడిపించే మార్గనిర్దేశకులని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలులోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో సోమవారం నిర్వహించిన మహిళా దినోత్సవానికి హాజరయ్యారు. సెర్ప్, మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తేనె, జ్యూట్ బ్యాగులు, జీడిపప్పు తదితర స్టాళ్లను పరిశీలించి నిడదవోలులోని 1211 స్వయం సహాయక సంఘాల్లోని 11,850 మంది మహిళలకు రూ.149.34 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కును అందించారు. మహిళలు ఆహార పదార్థాల తయారీలో రాణించేందుకు క్యూలెక్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సంస్థతో ఎంఓయూ కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, శిక్షణలో ఈ సంస్థ సహకరించి.. లాభదాయకమై ఉపాధిని కల్పిస్తుందన్నారు. మహిళా సాధికారతకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రతి కుటుంబం నుంచి ఓ మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగడమే సీఎం చంద్రబాబు ఆశయమన్నారు. 2026-27లో 5 లక్షల మంది మహిళలను తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. స్థానిక సంస్థలకే పరిమితమైన 33 శాతం రిజర్వేషన్లను పార్లమెంట్ స్థాయి వరకు వర్తింపజేసి చట్టసభలకు పంపడమే కూటమి ధ్యేయమన్నారు. కార్యక్రమంలో పురపాలక సంఘ చైర్మన్ ఆదినారాయణ, ఎంపీపీ భాగ్యలక్ష్మి, జడ్పీటీసీ సూరిబాబు, ఎంపీడీవో జగన్నాథం పాల్గొన్నారు.

మహిళలకు చెక్కు అందిస్తున్న మంత్రి దుర్గేష్

డెల్టా క్యాన్సర్ సెంటర్
A Unit of Rajamahendri Healthcare Private Limited
క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించండి. సురక్షితంగా జీవించండి.
నిష్ణాతులైన వైద్య నిపుణులు
అత్యాధునికమైన సాంకేతికతతో

సర్జికల్ ఆంకాలజీ | మెడికల్ ఆంకాలజీ | రేడియేషన్ ఆంకాలజీ
వెంకటేశ్వర నగర్, రాజమండ్రి. ✆ 9 613 613 613

నకిలీ పత్రాలతో ఉద్యోగం

✦ జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

రాజమహేంద్రవరం వైద్యం: నకిలీ పత్రాలతో ప్రభుత్వ ఉద్యోగంలో చేరారనే ఆరోపణలతో ప్రభుత్వ వైద్య కళాశాలలో జూనియర్ అసిస్టెంట్ హేమలతను కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్య కళాశాల ప్రిన్సిపల్ శివప్రసాద్ సస్పెండ్ చేశారు. ఆమెకు సహకరించిన సీనియర్ అసిస్టెంట్ అమర్‌కాంత్‌ను ఆర్డీ కార్యాలయానికి సరెండర్ చేస్తూ ఆదేశాలిచ్చారు. కాకినాడలో కాంట్రాక్టు ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేసే వినయ్‌సంపత్ కొవిడ్ సమయంలో మృతి చెందారు. అతడిని రెగ్యులర్ ఉద్యోగిగా చూపించి నకిలీ పత్రాలు సృష్టించారు. అప్పటికే ఖాళీలున్న రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాలలో కారుణ్య నియామకం పొందారు. దీనిపై గతేడాది సెప్టెంబర్‌లో కొందరు కాకినాడ డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేయగా డిసెంబర్‌లో విచారణ జరిగింది.

SRI SHIRDI SAI EDUCATIONAL INSTITUTIONS
For Whom Teaching is a passion ...
SRI SHIRDI SAI, embodying the pride of Andhra with its unparalleled commitment and unceasing Academic Excellence invites experienced applicants with excellent language command for its renowned CBSE and STATE Residential Schools, Jr. Colleges & Academies for the Year 2026-27.
DAFNE CIVILS ACADEMY — Political Science, Business Studies, Geography, Psychology, Economics
LAKSHYA IIT ACADEMY — Mathematics, Physics, Chemistry, Arithmetic & Reasoning
DEEKSHYA MEDICAL ACADEMY — Botany, Zoology, English, Sanskrit, Food Nutrition & Dietetics
PG / Trained Graduates with Subject command. Salary : ₹ 8 Lakh to 18 Lakh (p/a)
PRINCIPAL — Visionary PG with 360° managerial skills, min. 10 years of teaching and 3 years of Admin exp. Salary : ₹ 8 to 12 Lakh (p/a)
ADMINISTRATOR — (Male) Dynamic PG with excellent administrative skills. Salary : ₹ 4 Lakh to 8 Lakh (p/a)
PRE NURSERY — Montessori & Phonics certified Experienced Female Graduates
KINDERGARTEN — Montessori & Phonics certified Experienced Female Graduates Salary : ₹ 2.4 Lakh to 3.6 Lakh (p/a)
PRIMARY — Trained / Fresh Female Graduates with B.Ed / D.Ed Salary : ₹ 2.5 Lakh onwards (p/a)
HIGH SCHOOL — PG / Trained Graduates with B.Ed Salary : ₹ 3.5 Lakh to 6 Lakh (p/a)
SPECIAL EDUCATOR — PG / Graduates in Psychology with B.Ed in spl education Salary : ₹ 3 Lakh onwards (p/a)
OTHERS — Drawing, Librarian, Yoga, Hostel Tutors (M/F), Classical Dance, Co-Teacher, Wardens (M/F), Experienced Nurse, DTP Operators
ACCOMMODATION FACILITY AVAILABLE
Forward your CV to srishirdisai.institutions25@gmail.com or Walk-in-Interview with Original Certificates and latest Passport size Photograph from March 14th to 31st, April 5th, 11th to 14th , 19th to 30th between 10 am to 4 pm @ SRI SHIRDI SAI SCHOOL, All Bank Colony, RAJAHMUNDRY, AP Contact : 0883-2555955, 92810 30545

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

గ్రామీణ రహదారులకు మహర్దశ

అచ్చియ్యపాలెం-బుచ్చియ్యపాలెం రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు

దేవరపల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గ్రామీణ రోడ్ల రూపురేఖలు మారుతున్నాయని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు తెలిపారు. దేవరపల్లి పంచాయతీ పరిధిలోని పేరం చెరువు నుంచి అచ్చియ్యపాలెం వరకు సాస్కి నిధులు రూ.2.77 కోట్లతో, అచ్చియ్యపాలెం లింక్ రోడ్డు నుంచి బుచ్చియ్యపాలెం వరకు ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ.62 లక్షలతో నిర్మిస్తున్న రహదారి పనులను కూటమి నాయకులతో కలసి సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వైకాపా హయాంలో అయిదేళ్లు ఏ రోడ్డు చూసిన గుంతలే దర్శనమిచ్చాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రోడ్లకు మహర్దశ కలిగిందన్నారు. గ్రామాల్లో సీసీ, మిగతా ప్రాంతాల్లో బీటీ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. ఏళ్ల నాటి కల నెరవేరడంతో రెండు గ్రామాల పెద్దలు ఎమ్మెల్యేను సత్కరించారు. అనంతరం బేరన్న వద్ద మహిళా కూలీలతో ఆయన మాట్లాడారు. పొగాకు గ్రేడింగ్, క్యూరింగ్ విధానాన్ని పరిశీలించారు. ఇళ్లు, స్థలాలు లేని వాళ్లు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు తంగేళ్ల మునేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు సుంకర దుర్గారావు, సొసైటీ ఛైర్మన్ ఉప్పులూరి రామారావు, నందిగం శ్రీధర్, కాట్రు భీమరాజు, కరుటూరి బాలాజీ, నవీన్, వాసు, పంచాయతీ రాజ్ ఇన్‌ఛార్జి ఏతా షాజహాన్, తదితరులు, పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయానికి అర్జీలు

అర్జీ స్వీకరిస్తున్న ఏవో అచ్యుతకుమారి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే : కొవ్వూరు రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్‌కు డివిజన్ స్థాయిలో 9 మంది నుంచి అర్జీలు అందాయని కార్యాలయ పరిపాలనాధికారిణి డి.అచ్యుతకుమారి తెలిపారు. రీసర్వే, భూ ఆక్రమణలు, పురపాలక పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు ఇవ్వడం లేదని, సంక్షేమ పథకాలకు అర్హత, పారిశుద్ధ్య సమస్య వంటి అంశాలపై అర్జీలను స్వీకరించారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపనున్నట్లు అధికారులు తెలిపారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

విభిన్న ప్రతిభావంతులకు ట్రైసైకిళ్లు అందిస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, న్యూస్‌టుడే: అట్టడుగు వర్గాలకు, విభిన్న ప్రతిభావంతులకు తదేకం ఫౌండేషన్ అండగా నిలుస్తోందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు క్యాంపు కార్యాలయంలో సంస్థ సహకారంతో సోమవారం పలువురు ప్రతిభావంతులకు మంత్రి చేతుల మీదుగా ట్రైసైకిళ్లు అందించారు. దుర్గేష్ మాట్లాడుతూ తదేకం సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. ● 28 మంది లబ్ధిదారులకు రూ.26.32 లక్షల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను, ఎల్వోసీ పత్రాలను మంత్రి క్యాంపు కార్యాలయంలో అందించారు. ఇంత వరకు 673 మందికి రూ.5.12 కోట్ల లబ్ధి చేకూరిందని తెలిపారు. ● గణపతి కూడలిలో ఏర్పాటు చేసిన జనసేన ఉద్యమ క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. సభ్యత్వం అంటే కేవలం గుర్తింపు కార్డు కాదని.. పార్టీపై నమ్మకం, సమాజం పట్ల బాధ్యత, విలువకు నిదర్శనమని తెలిపారు. ● మాదక ద్రవ్య సమాజ నిర్మాణానికి ఈ నెల 12న నిడదవోలులో కలాం వైబ్రెంట్ సంస్థ, ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించే దండి మార్చ్-2.0 గోడపత్రికను మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పురపాలక సంఘ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, తెదేపా, జనసేన పట్టణ అధ్యక్షులు వెలగన సూర్యరావు, రంగా రమేష్, డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు సహకారం

తాళ్లపూడి: పైడిమెట్ట ఎత్తిపోతల పథకం మొదటి స్టేజ్ వద్ద కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు రూ.9.75 లక్షల చెక్కును సోమవారం పార్టీ కార్యాలయంలో పథకం కమిటీ సభ్యులకు అందజేశారు. గోదావరి వరదల కారణంగా షార్ట్ సర్క్యూట్ జరిగి కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తదాన్ని ఏర్పాటు చేసేందుకు సహకారం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పథకం అధ్యక్షుడు ముళ్లపూడి శ్రీరామచంద్రమూర్తి, ద్విసభ్య కమిటీ సభ్యులు సుబ్బారాయచౌదరి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమస్య: మెరకవీధి, ఏటిగట్టుకు చేరే గోదావరిమాత విగ్రహ కూడళ్ల వద్ద లారీల నుంచి ఇసుక జారిపడిపోయి ప్రమాదాలకు కారణమవుతోంది. - **కె.వరప్రసాద్**

సమాధానం: చర్యలు తీసుకుంటాం. - **సీహెచ్ వెంకటేశ్వర్లు, పురపాలక కమిషనర్, కొవ్వూరు**

- న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం

సమస్య: అన్నదేవరపేట నుంచి వెంకటయపాలెం వెళ్లే రహదారిలో కొవ్వాడ కాలువ పక్కన చెత్తాచెదారాలు పేరుకుపోయాయి. - **కె.రామారావు**

సమాధానం: వ్యర్థాలను తొలగిస్తాం. - **శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి**

- న్యూస్‌టుడే, తాళ్లపూడి

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కొవ్వూరు: 80085 74497
నిడదవోలు: 80085 74501, గోపాలపురం: 91212 29084

నీరు లేని తొట్టెలు.. దాహార్తితో మూగజీవాలు

మెట్ట ప్రాంతాల్లో అధ్యానంగా.. - కొరవడిన పర్యవేక్షణ

చాగల్లు, న్యూస్‌టుడే: మూగజీవాలకు తాగునీటి వసతిని కల్పించేందుకు ఉపాధి హామీ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన నీటి తొట్టెల నిర్మాణాలు నిరుపయోగంగా మారాయి. దీంతో మూగజీవాల దాహార్తి తీర్చాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. పైపులైన్లు ఏర్పాటు చేసి పంచాయతీల పర్యవేక్షణలో నీరు నింపి, పశుసంవర్ధక, పంచాయతీరాజ్ శాఖలు నిర్వహణ చేపట్టేలా కార్యాచరణ రూపొందించారు.

మల్లవరం గ్రామంలో..

కాలక్రమేణా అవి మూలకు చేరాయి. వేసవి పూర్తిగా ప్రారంభం కాకముందే భానుడు ప్రభావం చూపుతున్నాడు. మూగజీవాలు తాగునీటికి కటకటలాడుతున్నాయి.

లక్షలు వెచ్చించినా నిష్ప్రయోజనం

జిల్లాలో ఆవులు, ఎద్దులు సుమారు 1.05 లక్షలు ఉండగా, గేదెలు సుమారు 2.58లక్షలు ఉన్నాయి. గొర్రెలు, మేకలు 4.45లక్షలు ఉన్నాయి. వీటి తాగునీటి అవసరాలకు ప్రతి పంచాయతీ పరిధిలో నీటి తొట్టెలు ఏర్పాటు చేసేలా జిల్లాలోని 19 మండలాల్లో 222 నీటి తొట్టెలు నిర్మించారు. ఒక్కోదాని నిర్మాణానికి రూ.36వేల చొప్పున రూ.79.82లక్షలు కేటాయించారు. పలుచోట్ల ఈ నీటితొట్టెలు లీకేజి కావడం, పగుళ్లకు గురయ్యాయి. మరికొన్ని చోట్ల అధికారుల పర్యవేక్షణ లోపంతో చెత్త తొట్టెలుగా దర్శనమిస్తున్నాయి.

చాగల్లు, గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, తాళ్లపూడి, జగ్గంపేట, కోరుకొండ, రాజానగరం తదితర మెట్ట ప్రాంత మండలాల్లో భూగర్భ జలమట్టం పరిస్థితి దయనీయంగా ఉంటోంది. మిగిలిన చోట్ల కూడా రానున్న వేసవి మరింత తీవ్రంగా ఉంటోందని అధికారులు ఇప్పటికే చెప్పడంతో ఆయా డెల్టా మండలాల్లో కూడా తాగునీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉంది. జీవాలకు తాగునీటి వసతి కల్పించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ఉగాది నాటికి అందుబాటులోకి

మూగజీవాల కోసం ఏర్పాటుచేసిన నీటి తొట్టెలు ఉగాది నాటికి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నాం. ఉన్నతాధికారులు పూర్తి స్థాయి దృష్టి సారించారు. ఇందుకు ప్రత్యేక సూచనలు, యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. వేసవిలో మూగజీవాలు తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తాం. - **బి.రామ్‌ప్రసాద్, డ్వామా ఏపీడీ**

సేంద్రియ వ్యవసాయంతో మేలు

మాట్లాడుతున్న జిల్లా ఏపీసీఎన్ఎఫ్ అడిషనల్ డీపీఎం వల్లి

తాళ్లపూడి, నల్లజర్ల, న్యూస్‌టుడే: సేంద్రియ పద్ధతిలో పండించిన ఆహారంతో ఎన్నో లాభాలు ఉన్నాయని జిల్లా ఏపీసీఎన్ఎఫ్ అడిషనల్ డీపీఎం వల్లి తెలిపారు. తాళ్లపూడి మండల సమాఖ్య కార్యాలయంలో మండలస్థాయి సమాఖ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ విధివిధానాలను వివరించారు. ఏపీఎం మంగాయమ్మ మాట్లాడుతూ సంఘాల్లోని అందరూ ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ వరలక్ష్మి, వీవోఏలు, ఎఫ్‌పీవోలు, బోర్డు డైరెక్టర్లు, మండల సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు. ● రసాయన ఎరువులను తగ్గించి సేంద్రియ పద్ధతిలో పంటలు పండించి అధిక దిగుబడులు సాధించేలా రైతులు కృషి చేయాలని మండల వ్యవసాయాధికారి సోమశేఖరం తెలిపారు. ఏపీ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్, వెలుగు కార్యాలయం సంయుక్తంగా స్థానిక ఏపీఎం కార్యాలయం వద్ద సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. సేంద్రియ వ్యవసాయాన్ని ముందుకు తీసుకువెళ్లే విధానం, ఉత్పత్తుల మార్కెటింగ్ వంటి అంశాలపై ఆయా గ్రామాల డ్వాక్రా సంఘాల వీవోలు, నేచురల్ ఫార్మింగ్ సిబ్బందితో చర్చించారు. కార్యక్రమంలో ఏపీఎం శ్యాంసుందర్, ప్రకృతి వ్యవసాయం మాస్టర్ శిక్షకుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలు తొలగించారు

స్పందనకు స్పందనం

దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం కొత్తపేట ప్రాంతంలోని సాయిబాబా ఆలయం ప్రధాన రహదారిలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన చెందారు. విషయాన్ని పంచాయతీ కార్యదర్శి ఎం.రాణి దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకువెళ్లగా ఆమె స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. - **న్యూస్‌టుడే, దేవరపల్లి**

కాలువ శుభ్రం

మండలంలోని మలకపల్లి ఓసీ ప్రాంతం నాలుగో వార్డులోని మురుగు కాలువలో వ్యర్థాలు పేరుకుపోయి స్థానికులు ఇబ్బంది పడుతుండడంతో విషయాన్ని పంచాయతీ సర్పంచి రాపాక రాజేశ్వరి, కార్యదర్శి కామేశ్వరి దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించి కాలువ శుభ్రం చేయించారు.

- **న్యూస్‌టుడే, తాళ్లపూడి**

ఎస్సీలో చేర్చాలంటూ నిరసన

పెరవలి, న్యూస్‌టుడే: పెరవలి గ్రామానికి చెందిన బేడబుడ్గజంగం కులస్థులు తమను ఎస్సీలో చేర్చాలని పెరవలి తహసీల్దార్ కార్యాలయం పర్యవేక్షకులకు సోమవారం వినతిపత్రం అందించారు. గ్రామాల్లో కులాలకు సంబంధించి సర్వే నిర్వహిస్తున్నారని.. తమ కులస్థులకు ఎటువంటి రిజర్వేషన్ లేదని.. తమది ఎస్సీ కులమని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు పేర్ల నాగులు, పీడీ ప్రసాద్, నీరుకొండ నాగరాజు, సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ, వెంకన్న తదితరులు ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

తహసీల్దార్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

చాగల్లు, గోపాలపురం, న్యూస్‌టుడే: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, మహిళల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చాగల్లు తహసీల్దార్ ఎం.మెరికమ్మ తెలిపారు. చాగల్లులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది తహసీల్దార్ మెరికమ్మను, పలువురు మహిళలను సత్కరించారు. ● గోపాలపురం మండల మానవత సంస్థ ఆధ్వర్యంలో స్థానిక శార్వాణి ప్రైవేటు పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పలువురు మహిళలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రాంబాబు, వెంకట్, జోగేంద్రప్రసాద్, రాధాకృష్ణ, ఫణికుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీపాదవల్లభుడికి పూజలు

పెరవలి మండలం ఖండవల్లిలోని వేణుగోపాలస్వామి కల్యాణ మండపంలో శ్రీపాదవల్లభునికి సోమవారం పాలాభిషేకాలు చేశారు. పిఠాపురానికి చెందిన శ్రీపాదశ్రీవల్లభ ఆలయానికి చెందిన రథం దక్షిణ దేశ యాత్రలు చేసుకుంటూ ఖండవల్లికి చేరుకుంది. యాత్రలో భాగంగా స్వామి వారికి గ్రామ దేవత పోలేరమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక హారతులు నిర్వహించారు. - **న్యూస్‌టుడే, పెరవలి**

గౌరీశ్వరస్వామికి అభిషేకాలు

మండలంలోని మోర్తలో కొలువైన గౌరీశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని విశేషంగా అలంకరించారు.

- **న్యూస్‌టుడే, ఉండ్రాజవరం**

15వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

శ్రీ కృష్ణ హాస్పటల్‌ను ప్రారంభించి నేటికి 15 సంవత్సరములు పూర్తిచేసుకొన్న శుభ సందర్భంగా మిత్రులకు, శ్రేయోభిలాషులకు వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ..

ఎప్పటిలాగే మీ అందరి ఆదరాభిమానాలు పొందాలని ఆకాంక్షిస్తూ..

డా॥ పాత్రో రాశీ విశ్వనాథం MD., DCH పిల్లల వైద్యనిపుణులు

డా॥ పాత్రో దుర్గా విశాలక్ష్మి MS., OBG ప్రసూతి, గర్భకోశ వైద్యనిపుణులు

శ్రీ కృష్ణ హాస్పటల్

టౌన్ హాల్ వీధి చివర, తణుకు

ఫోన్: 08819-241077, సెల్: 93932 41077

లక్ష్యసాధనకు మనసు ఆధీనంలో ఉండాలి

బహుమతులు అందుకున్న విద్యార్థులతో అనాలయ బంతిజీ తదితరులు

నిడదవోలు, న్యూస్‌టుడే: లక్ష్యసాధనకు మనసు ఆధీనంలో ఉంచుకోవాలని ఉండ్రాజవరం బౌద్ధ పీఠాధిపతి అనాలయ బంతిజీ అన్నారు. నిడదవోలు వెలగపూడి రామకృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ గ్రూపుల్లో డిగ్రీ పూర్తి చేసి ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు ప్రధానాచార్యులు డాక్టర్ కె.జ్యోతి అధ్యక్షతన సువంకళ్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శ్వాసపై ధ్యాస, ఇంద్రియ నిగ్రహం అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, బహుమతులను అనాలయ చేతుల మీదుగా అందజేశారు. ఫౌండేషన్ అధినేత సుంకవల్లి వెంకన్నచౌదరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాదాలకుంటలో బడిబాట

గోపాలపురం, న్యూస్‌టుడే: ప్రతి చిన్నారి బడికి వెళ్లాలని ప్రధానోపాధ్యాయురాలు కనకదుర్గ అన్నారు. వాదాలకుంట ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించి ర్యాలీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రధాన సెంటర్లలో మానవహారంగా ఏర్పడి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే సౌకర్యాలు వివరించారు. కార్యక్రమంలో సర్పంచి జె.మణెమ్మ, ఉపాధ్యాయులు కృష్ణ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

శ్రీవారి సన్నిధిలో కొవ్వూరు ఎమ్మెల్యే

ఎమ్మెల్యే దంపతులకు జ్ఞాపిక అందజేస్తున్న దేవస్థానం ఛైర్మన్

వాడపల్లి(అత్రేయపురం), న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామివారిని సోమవారం కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వాగతం పలికి మూలమూర్తి దర్శనం చేయించారు. దేవస్థానం ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు స్వామివారి జ్ఞాపిక అందజేశారు.

ది జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప॥గో॥ జిల్లా, ఏలూరు
బ్రాంచ్ : కొవ్వూరు

వ్యవసాయేతర బంగారు నగల వేలం ప్రకటన

క్రింది ఉదహరించిన ఖాతాదారులు మా బ్యాంకు నందు బంగారు నగలు తనఖాగా పెట్టి అప్పు తీసుకుని తిరిగి చెల్లించమని నోటీసులు పంపిననూ చెల్లించని కారణంగా బ్యాంకు నిబంధనల ప్రకారం 17-03-2026, మంగళవారం మధ్యాహ్నం గం. 12:00 నా॥లకు బ్యాంకు ఆవరణలో బంగారు ఆభరణములు వేలం వేయబడును. వేలం వేసినా బకాయి రద్దుకాని యెడల వారిపై చట్టరీత్యా తగు చర్య తీసుకొని మిగిలిన బకాయిలు వసూలు చేయబడును. ఈ దిగువ తెలిపిన ఖాతాదారులలో ఎవరైనా మరణించిన యెడల వారి వారసులకు ఈ వేలం నోటీసు వర్తిస్తుంది. నోటీసులు తిరస్కరించిన వారికి షరతుకాముఖంగా వివరిగా తెలియజేయబడునది.

ప.నెం.	లోన్ నెం.	ఋణగ్రహీత పేరు చిరునామా	ఒరవు గ్రాములలో
1.	207002578232	నరవ వీర వెంకట దుర్గా బాలాజీ S/o భాస్కరరావు చందా నత్రం వీధి గ్రంధి వారి వీధి, రాజమండ్రి	29.700

షరతులు: 1. వేలంలో పాల్గొనువారు రూ. 10,000/-లు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించవలెను. వేలంలో ఆభరణములు పొందిన వారికి సెక్యూరిటీ డిపాజిట్ వేలం అనంతరం తిరిగి చెల్లించబడును.వేలంలో ఆభరణములు పొందినవారు సెక్యూరిటీ డిపాజిట్ మినహా మిగిలిన సొమ్ము చెల్లించి ఆభరణములు పొందవలెను. 2. ఏ స్థితిలోనైనా వేలం నిలుపుదల చేయుటకు గాని, వాయిదా వేయుటకు గాని, నియమ నిబంధనలను మార్చుటకు గాని బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు. 3. వేలంలో పాడిన సొమ్మును అంగీకరించుటకు లేక తిరస్కరించుటకు బ్యాంక్ వారికి పూర్తి అధికారము కలదు. 4. బంగారం వేలం ద్వారా వచ్చిన మొత్తాన్ని బంగారం రుణానికి సర్దుబాటుచేయగా మిగిలిన మొత్తాన్ని వారికి గల ఇతర ఋణములకు జమచేయబడును.

స్థలం: కొవ్వూరు
తేది. 09-03-2026.

సం/- బ్రాంచి మేనేజర్
డి.సి.సి.బి, కొవ్వూరు బ్రాంచి, సెల్: 9704678815

నేటి నుంచి హెచ్‌పీవీ వ్యాక్సినేషన్

● డివిజనులో 4410 మంది బాలికలు

డిప్యూటీ డీఎంహెచ్‌వో జె.సంధ్య

కొవ్వూరు పట్టణం, నల్లజర్ల, చాగల్లు, దేవరపల్లి, తాళ్లపూడి, న్యూస్‌టుడే : బాలికల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని.. గర్భాశయ క్యాన్సర్ బారిన పడకుండా ముందస్తు ప్రణాళిక చేపట్టి వ్యాక్సిన్‌లు వేస్తుందని కొవ్వూరు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జె.సంధ్య సోమవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ద్వారా 14 నుంచి 15 ఏళ్ల లోపు బాలికలకు హెచ్‌పీవీ టీకాలు వేసే కార్యక్రమం ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభం కానుందన్నారు. కొవ్వూరు డివిజను పరిధిలోని 20 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, నాలుగు యూపీ హెచ్‌సీలకు వ్యాక్సిన్లు వచ్చాయన్నారు. తొమ్మిది మండలాల్లో చేపట్టిన సర్వే ద్వారా 4410 మంది బాలికలను గుర్తించినట్లు వివరించారు. ● నల్లజర్ల మండల పరిషత్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులకు నల్లజర్ల ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి తెల్లం గంగాధరరావు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవగాహన కల్పించారు. బాలికలు విడతల వారీగా వ్యాక్సిన్ వేయించుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణ, అదనపు విద్యాశాఖాధికారిని భగవతీదేవి, డిప్యూటీ ఎంపీడీవో సింహాద్రిరావు, విద్యుత్తుశాఖ ఏవో బాపిరాజు, కమ్యూనిటీ హెల్త్ అధికారి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు. ● చాగల్లు పీహెచ్‌సీలో హెచ్‌పీవీ టీకా వేయనున్నట్లు ఆసుపత్రి వైద్యాధికారిణి తనూజ తెలిపారు. ● దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద దేవరపల్లి, యాదవోలు, గౌరీపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించి వైద్యఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బందితో ఎంపీపీ కేవీకే.దుర్గారావు సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో సుమారు 524 మంది బాలికలను గుర్తించామని వీరందరికి టీకా అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్.నాగార్జునరావు, వైద్యాధికారులు డి.సంజీవ కుమార్, పి.ప్రశాంత్ పాల్గొన్నారు. ● తాళ్లపూడి మండలంలోని మలకపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద వ్యాక్సిన్ వేస్తున్నట్లు వైద్యురాలు అన్నపూర్ణ తెలిపారు. 181 మంది బాలికలను గుర్తించినట్లు వివరించారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

నిడదవోలు, న్యూస్‌టుడే: తాడిమళ్ల, కోరుమామిడి విద్యుత్తు సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఈ నెల 10న విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని నిడదవోలు డివిజన్ ఈఈ ఎన్.నారాయణ అప్పారావు సోమవారం తెలిపారు.

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి (సీనియర్ డి.విజన్) వారి కోర్టులో
E.P.No. 47/2024
O.S.No. 263/2013.

Between :
బి.ఎస్.ఆర్.నాగ సతీష్ ....డి.హెచ్.ఆర./వాది
Vs.
దేవత ఉపారాజీ ....జె.డి.ఆర్../ప్రతివాది.

వేలం ప్రకటన

పై నెంబరు డిక్రీ బాకీ వసూలుకు గాను జె.డి.ఆర్. తాలూకా ఈ దిగువ షెడ్యూలు రాబాలు స్థిరాస్తిని 31.03.2026 వ తేదీన ఆదివారం 10.30 వ॥ల లగాయితు శ్రీ కోర్టువారి ఎదుట వేలం జరుగును. కావున ఆసక్తి గల పాటదారులు వేలం విషయాల గురించి కోర్టువారి నజారత్‌లో గాని డి.హెచ్.ఆర్., అడ్వకేటు గారి ఆఫీసులో గాని సంప్రదించగలరు. కావున కాపలిన వారు వేలం పాటలో పాల్గొనవచ్చును.

షెడ్యూలు

పూర్వము పశ్చిమ గోదావరి జిల్లా ప్రస్తుతము తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో చేరిన కొవ్వూరు మండలము, దొమ్మేరు గ్రామ పంచాయితీ, దొమ్మేరు గ్రామము తాలూకా ఆర్.ఎస్.నెం.499/4 రు. యు.1-08 ట్టులో మధ్య గల కూర్పు వైపున గల యు.0-06 ట్టు స్థలములో దక్షిణం వైపున 157 1/2 గజములు సమీప దారు నెం.5-104, 5వ వార్డుకు నెలమీద స్థలమునకు హద్దులు : తూర్పు : 39 లింకులు లేక 26 అడుగులు పెరివర్గ సర్రాజు గారి స్థలం, దక్షిణం : 83 లింకులు లేక 55 అడుగులు పెరివర్గ హనుమంతరాజు గారి ఇల్లు స్థలము, పడమర: 39 లింకులు లేక 26 అడుగులు రాజీద్, ఉత్తరం : 82 లింకులు లేక 54.3 అడుగులు ముదునూరి గోపాలరాజు గారి స్థలం.

పై హద్దులు మధ్య 157 1/2 చ॥గజాల స్థలము మరియు సమస్త ఈబావెంటూ హక్కులతో సహా.

డి.హెచ్.ఆర్.వాల్యూ : రూ.4,00,000-00
అమీనా వాల్యూ : రూ.5,00,000-00
జె.డి.ఆర్.వాల్యూ ఎమియూనూ ఇచ్చియుండలేదు.

ఇట్లు
గంధం నరసింహారావు, బి.ఎ., బి.ఎల్.,
వి. (జె.) బంగారు లక్ష్మి,
లక్ష్మకోర్టు, కొవ్వూరు, తూ.గో.జిల్లా
సెల్ నెం. : 94403 82780

స్థలం : కొవ్వూరు
తేది.09-03-2026

పశువుల పాక దగ్ధం

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: మండలంలోని తాడిపర్రుకు చెందిన రైతు కాసకాని వెంకటరమణ పశువుల పాక సోమవారం దగ్ధమైంది. రెండు పాడిపశువులు మంటల్లో చిక్కుకొని కాలిపోవడంతో తీవ్రగాయాలపాయ్యాయి. వాటికి చికిత్స అందిస్తున్నారు. సుమారు రూ.2లక్షల ఆస్తి నష్టం జరిగిందని రైతు వాపోయారు. అగ్ని ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

నల్లజర్ల, న్యూస్‌టుడే: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకున్నపుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎస్సార్కే డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వీరాంజనేయులు తెలిపారు. నల్లజర్లలోని కళాశాల ప్రాంగణంలో సోమవారం విద్యార్థులకు ఉపాధి అవకాశాలు, ప్రభుత్వం అందిస్తున్న పలు శిక్షణ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువు పూర్తిచేశాక ఉద్యోగాల అన్వేషణే కాకుండా వ్యాపారాల వైపు కూడా మొగ్గు చూపాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అందిస్తున్న ఏపీఎంఎస్‌ఈ డెవలప్‌మెంట్ వంటి ఉచిత శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**ఉండ్రాజవరం, న్